

డీఎస్సీపై 'డౌట్'లోడ్
ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీలో పొరపాట్లు చోటుచేసుకుంటున్నాయి. శనివారం మధ్యాహ్నం హాల్ టికెట్లు కొందరికి మాత్రమే డౌన్‌లోడ్ అయ్యాయి. 8లో▸



నడవలేని 'తల్లీబిడ్డ'
కూటమి ప్రభుత్వంలో మళ్లీ పాత రోజులు వస్తున్నాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో బాలింతల తరలింపునకు బ్రేకులు పడుతున్నాయి. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,596.21
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:17.211
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:20,100
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:197

న్యూస్‌రీల్

మే నెలలో 165 శాతం అధిక వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి మే నెలలో అధిక వర్షాలు కురిశారు. మే నెల మొత్తం వేసవి ఉంటుంది. వేసవిలో కురిసే వర్షాలను ఆన్ సీజనల్‌గా వ్యవహరిస్తారు. అలాంటిది అన్ని మండలాల్లో వర్షాలు పడటంతో వేసవి తీవ్రత ఈ సారి పెద్దగా కనిపించలేదు. మామూలుగా అయితే రోహిణి కార్తెలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉండాలి. ఈ సారి రోహిణి కార్తె చల్లదనం పంచింది. 2024 వేసవిలో రికార్డు స్థాయిలో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలో గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలే నమోదు కావడం గమనార్హం. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా 106.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 165 శాతం అధిక వర్షం కురిసింది. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. ఉంది. మే నెలలో మురిపించిన వర్షాలు జూన్‌లో ఏ స్థాయిలో మెరిపిస్తాయనేది వేచి చూడాల్సిందే.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. అదేవిధంగా అర్జీదారులు meekoram.ap.gov.in అనే వెబ్‌సైట్‌లోనూ అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'ఇంటి వద్దే పింఛను' నామమాత్రమే!

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఇంటిదగ్గరే పింఛన్ల పంపిణీ నామమాత్రమే అవుతోంది. జూన్ నెల పింఛన్ల పంపిణీ శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. పింఛనుదారుల ఇంటి నుంచి 300 మీటర్ల దూరంలో పంపిణీ చేసే అవకాశం కల్పించినప్పటికీ లబ్ధిదారులను ఒక్కచోటుకు చేర్చడం, లేకపోతే సచివాలయాల వద్దకు పిలిపించుకొని పంపిణీ చేయడం గమనార్హం. కర్నూలు జిల్లాలో 2,37,200 పింఛన్లు ఉండగా సాయంత్రం 6 గంటల సమయానికి 92.30 శాతం పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,13,377 పింఛన్లు ఉండగా 91.08 శాతం పంపిణీ పూర్తయింది. వివిధ కారణాలతో పింఛన్లు తీసుకోని వారు ఈనెల 2వ తేదీన తీసుకోవచ్చని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నంద్యాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి పాస్ అయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏడీఆర్ జాన్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 28 నుంచి జూన్ 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. www.angrau.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయాన్ని (9989625208)ను సంప్రదించాలన్నారు.

కాడి పట్టి.. కన్నీటి సాగు

- నేటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- అందని పంట రుణాలు
- వేధిస్తున్న విత్తనాల సమస్య
- రైతులకు పెట్టుబడి కష్టాలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

రెక్కల కష్టాన్నే నమ్ముకున్న రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. పంట పొలాల్లో సేద్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా అందరికీ అన్నం పెట్టాలనే లక్ష్యంతో కర్షకులు పొలం బాట పట్టారు. నష్టాలు వస్తున్నా భయపడకుండా మళ్లీ కాడి పట్టి ఖరీఫ్‌లో 'కన్నీటి' సాగుకు సన్నద్ధమయ్యారు.



ఇటీవల సాగు చేసిన పత్తిలో అంతర సేద్యం చేస్తున్న రైతు

కర్నూలు(అగ్రికల్చర్): వరుణుడు కరుణించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఇసుమంత కూడా ప్రోత్సాహం ఇవ్వడం లేదు. ఆదివారం (నేటి) నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో రైతులు కన్నీటితోనే సాగుకు సిద్ధమయ్యారు. దాదాపు 15 రోజులుగా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల బీటీ పత్తి సాగు చురుగ్గా సాగుతోంది.

క'రుణ' లేక



ఖరీఫ్ రైతులకు పెట్టుబడి సమస్య ప్రధానంగా ఉంది. బ్యాంకులు రైతులకు అవసరమైన పంట రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. 2025–26లో వ్యవసాయ రంగానికి ఉమ్మడి జిల్లాలో రూ.16 వేల కోట్ల రుణాలు పంపిణీ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు పాత రుణాలను రెన్యువల్ చేయడం మినహా కొత్త రుణాలు లేదు. ప్రభుత్వం చేయూత ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు.

బది'లీలలు'



రైతుల కష్టాలను వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదు. బదిలీల వ్యవహారం సాగుతుండటంతో కొందరు పైరవీలు చేస్తున్నారు. అనుకూలమైన స్థానానికి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీలను జూన్ 2వ తేదీ అర్ధరాత్రిలోపు ముగించాల్సి ఉంది. మూడవ తేదీ బదిలీలు వివరాలు బయటికి వస్తాయి. అంటే జూన్ మొదటి వారం వరకు విత్తనాలు, రైతు సమస్యల గురించి పట్టించుకునే వారు లేరు.

ఎరువు బరువే!

ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయ యంత్రాంగం చెబుతున్నా ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 2,15,450 టన్నుల ఎరువులు అవసరం. ప్రస్తుతం 62142 టన్నుల ఎరువులు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు 2.50 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా 48 వేల టన్నులు ఉన్నాయి. ప్రైవేటు డీలర్లు ఎరువు బస్తాను రూ.50 వరకు అధిక ధరతో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

'భూసార' నిస్సారం



ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 50 వేలకుపైగా భూసార పరీక్షలు చేయాలనేది లక్ష్యం. కర్నూలు జిల్లాలో 25,942 భూసార పరీక్షలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 15 వేల వరకు మట్టి నమూనాలు సేకరించారు. నంద్యాల జిల్లాలో 25వేల భూసార పరీక్షలు చేయాల్సి ఉండగా 10 వేల నమూనాలు సేకరించలేదు. ఇంతవరకు భూసార పరీక్షలు నిర్వహించే ప్రక్రియనే మొదలు కాలేదు.

విత్తు..విపత్తు



ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కర్నూలు జిల్లాకు 10,261.50 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారు. ఇందులో వేరుశనగ 9,099 క్వింటాళ్లు ఉండగా మిగిలిన వాటిలో కందులు, మినుములు, పెసర, పచ్చి రొట్ట ఎరువులు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు 8,766 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించగా... ఇందులో వేరుశనగ 2,009, కందులు 2,000 క్వింటాళ్లు ఉండగా.. మిగిలిన వాటిలో మినుములు, కొర్ర తదితర విత్తనాలు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే 2025–26లో విత్తనాలు నామమాత్రంగా కేటాయించడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ సారి విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కే ప్రమాదం ఏర్పడింది. సబ్సిడీపై విత్తనాలు పొందాలంటే రైతులు డి.క్రిషి యాప్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇంతవరకు ఈ ప్రక్రియనే మొదలు కాలేదు.

సాగు ఇలా..

ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 4,23,344 హెక్టార్లలో సాగు కానున్నాయి. జిల్లాలో ప్రధానంగా పత్తి 2,34,409 హెక్టార్లలో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. పత్తితో పాటు కంది, వేరుశనగ, మొక్కజొన్న, వరి, ఆముదం ప్రధాన పంటలు. నంద్యాల జిల్లాలో వరి ప్రధానపంట. వరితో పాటు కంది, మినుము, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ సాగు చేస్తారు.

విత్తనాల కేటాయింపు ఇలా ఉంది....

విత్తనం	క్వింటాళ్లలో
వేరుశనగ	9,009
కందులు	892.50
మినుము	25
పెసర	10
కొర్ర	70
దయంచ	154
పిల్లి పెసర	11
సన్‌హెంప్	-
వరి	-
మొత్తం	10,261

దిక్కులు చూస్తున్నాం



మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. వర్షాధారం కింద పంటలు సాగు చేస్తున్నాం. ఖరీఫ్ ముంచుకొస్తోంది. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా ఇచ్చేవారు. ఇది రైతులకు ఊరట నిచ్చేది. ఇపుడు రైతులకు చేయూత లేకపోవడంతో దిక్కులు చూస్తున్నాం.

– కే.గంగన్న, బస్తిపాడు, కల్లూరు మండలం

అప్పులు తెస్తున్నాం



కూటమి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. 2024–25లో ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడిసాయానికి మంగళం పలికారు. ఈ సారి ముందస్తుగా వానలు పడుతున్నాయి. విత్తనాలు లేవు. ఆర్‌బీకేల్లో ఎరువులు కరువు. పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.

– లింగన్న, మార్లెళ్ల, తుగ్గలి మండలం

చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దాం



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి, పార్టీ నాయకులు

- 4న వెన్నుపోటు దినం భారీగా నిర్వహిద్దాం
- పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): విద్యార్థులను, మహిళలను, రైతులను, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 4న నిర్వహించే 'వెన్నుపోటు దినం' నిరసనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. కల్లూరులోని తన గృహంలో పాణ్యం నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితుల బహిష్కరణ వంటి దుర్మార్గపు పాలన జరుగుతోందన్నారు. వేలం లేకుండా, క్యాబినెట్‌లో చర్చించకుండా దేవదాయ భూములను టీడీపీ నాయకులకు అప్పగించేందుకు చీకటి జీవో తెచ్చారని ఆరోపించారు. టీడీపీ నాయకులకు అనుకూలంగా పోలీసులు అత్యుత్సాహం చేయడం తగదన్నారు. అనంతరం 'వెన్నుపోటు దినం' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు సూర్యనారయణ రెడ్డి, మిడుతూరు శ్రీనివాసులు, పార్టీ నాయకులు హనుమంతరెడ్డి, భీమేశ్వరరెడ్డి, క్రిష్ణమూర్తి, కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి, కార్పొరేటర్లు నారాయణ రెడ్డి, నాగలక్ష్మీరెడ్డి. అరుణ, సుదర్శన్ రెడ్డి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తనివ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఇరిగేషన్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నీటి తొట్టెలు, పైపు లైన్లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు.

- ➡ వైద్య ఆరోగ్య శాఖాధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
- ➡ ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో వస్తున్న అర్జీల్లో 90 శాతం రెవెన్యూ శాఖ నుంచే వస్తున్నాయని, తహసీల్దార్లు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు.
- ➡ హౌస్ ఫర్ ఆల్ కార్యక్రమంలో భాగంగా ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, ఇప్పటి వరకు 4వేల అర్జీలు మాత్రమే రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
- ➡ సీసీఆర్‌సీ కార్డులకు 25వేల లక్ష్యంలో 1,125 మాత్రమే ఇచ్చారన్నారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు



క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్ చూపిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు

- రూ.91 లక్షల నగదు, 7 సెల్‌ఫోన్లు సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ఆదోని వాల్మీకి నగర్‌లోని వాల్మీకి గుడికి ఎదురుగా మొబైల్ ఫోన్లలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఏడుగురు ముఠా సభ్యులను ఆదోని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.91 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఏడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు గత నెల 18న క్రికెట్ బెట్టింగ్ ముఠాపై దాడి చేసి నాగరాజును అదుపులోకి తీసుకోగా మిగిలిన ఆరుగురు పారిపోయారు. సాంకేతికత ఆధారంగా మిగిలిన ఆరుగురిని కర్నూలు, హైదరాబాద్, ఒంగోలు, చిలకలూరిపేట, బెంగళూరు సిటీ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నాగరాజుతో పాటు ఆదోని పట్టణానికి చెందిన మసీదుపుర ఇస్మాయిల్ అలియాస్ ఇస్మాయిల్, బోయ మహానంది, బోయ రమేష్, బెంగళూరు సిటీకి చెందిన ఎస్.రాజేష్, ఒంగోలు పట్టణానికి చెందిన అడ్డాల కళ్యాణ్, హైదరాబాద్‌కు చెందిన రఘు ఆచారి తదితరులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎదుట హాజరు పరిచారు. ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌తో కలసి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నేషనల్ ఎక్సేంజ్ 9, రాధే ఎక్సేంజ్, వజ్రా ఎక్సేంజ్, నేషనల్ 777, మోర్ ఎక్సేంజ్ తదితర క్రికెట్ బెట్టింగ్ యాప్స్‌లో వీరు బెట్టింగ్ నిర్వహించినట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. చాలామంది యువకులు క్రికెట్ బెట్టింగ్‌ను ఆన్‌లైన్‌లో ఆడుతూ డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారని ఎస్పీ అన్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. బెట్టింగ్‌ను ఎలాగైనా అరికట్టాలని గత నేర సమీక్ష సమావేశంలో క్షేత్రస్థాయి అధికారులకు గట్టిగా ఆదేశించినట్లు తెలిపారు. సాంకేతికత సహాయంతో క్రికెట్ బుకీలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఆదోని డీఎస్పీ హేమలత, సీఐ శ్రీరామ్‌తో పాటు ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ మునుస్వామి, రంగస్వామి, ఏకవీర, ఫక్కీరప్ప, హుసేన్ బాషాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బదిలీలు.. రాయ'బేరాలు'

- రెవెన్యూలో అన్ని కేడర్లలో కలిపి 200 మంది ఉద్యోగుల దరఖాస్తు
- తహసీల్దార్ పోస్టులకు పెద్ద మొత్తంలో డబ్బుల డిమాండ్
- సిఫార్సు లేఖల కోసం భారీగా వసూళ్లు
- సోషల్ మీడియాలో సిఫార్సు లేఖలు హల్‌చల్

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం పైరవీలు తొక్కుతోంది. ఫోకల్ స్థానం కోసం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. బదిలీకి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ సిఫార్సు లేఖ కోసం ప్రజాప్రతినిధుల దగ్గరకు వెళ్తున్నారు. వారికి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పి లేఖలను సొంతం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెవెన్యూ శాఖలో అన్ని క్యాడర్లలో కలిపి 200 మంది ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒకే స్థానంలో ఐదేళ్ల పనిచేసినా ఉద్యోగులను కచ్చితంగా బదిలీ చేయాలి. అనారోగ్యం, స్పౌజ్, మ్యూచ్యువల్ తదితర విషయాల్లోనే బదిలీలు ఉంటాయి. జూన్ 2వ తేదీలోపు బదిలీ ప్రక్రియను ముగించాలని గడువును విధించింది. ఈక్రమం పైరవీల పర్వం ప్రారంభమైంది.

భారీ వసూళ్లు

తహసీల్దార్ క్యాడర్ పోస్టు బదిలీ సిఫార్సు లేఖ కోసం పెద్ద మొత్తంలో కొందరు ప్రజాప్రతినిధులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరానికి 80 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో తహసీల్దార్ పోస్టు కోసం రూ.10 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, వీఆర్వోల బదిలీలకు కూడా సిఫార్సు లేఖల కోసం కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా డబ్బులు తీసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. కాగా.. వీఆర్వోల బదిలీలకు 'పచ్చ' నేతలు భారీ వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. అంతేకాక కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు కూడా వసూళ్ల పర్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.



సోషల్ మీడియాలో కనిపించిన మంత్రి టీజీ భరత్ సిఫార్సు లేఖ

సోషల్ మీడియాలో మంత్రి సిఫార్సు లేఖ వైరల్

ఉద్యోగుల బదిలీల్లో ప్రజాప్రతినిధులు జోక్యం ఎక్కువగా ఉందని ఉదాహరణగా చూపుతూ మంత్రి టీజీ భరత్ ఇచ్చిన ఓ లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కర్నూలులోని ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్‌లో జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకటరాముడు తన సిఫార్సు లేఖను ఏకంగా వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. ఆయన్ను జిల్లా సివిల్ సప్లై మేనేజర్‌గా బదిలీ చేయాలని ఆ లేఖలో ఉంది. గుట్టుగా ఉండాల్సిన సిఫార్సు లేఖలు ఏకంగా సోషల్ మీడియాకు ఎక్కాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నేడు కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ రాత పరీక్ష

కర్నూలు: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1వ తేదీ (ఆదివారం) పోలీస్ కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) అభ్యర్థులకు మెయిన్స్ రాత పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలులో 16 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతో పాటు సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే హాల్‌లోకి అనుమతిస్తామని.. 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసివేయా లని ఆదేశించారు. 16 పరీక్ష కేంద్రాల్లో 7,588 మంది అభ్యర్థులు మెయిన్ రాత పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 828.20 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం శనివారం సాయంత్రం సమయానికి 828.20 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 47.7648 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శుక్రవారం నుంచి శనివారం వరకు జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 74,135 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్టులకు 2,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 0.291 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.484 మిలియన్ యూట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 1,733 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు 416 క్యూసెక్కులను వదిలారు.



క్లుప్తంగా

రజక విద్యార్థులకు 7న ప్రతిభా పురస్కారాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న రజక విద్యా సేవా సమితి నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు ఈనెల 7న ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 10వ తరగతిలో 450, ఇంటర్‌లో 800 మార్కులకు పైగా, డిగ్రీలో 80 శాతం, బీటెక్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించిన వారితో పాటు ఎంసెట్, ఇంజనీరింగ్, మెడిసిన్‌లో 10వేల లోపు ర్యాంకులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు జూలై 31లోగా 9110396511 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ బండారు లింగమయ్య, మహిళా అధ్యక్షురాలు బాపనపల్లి రాధ, న్యాయవాది జగదీష్ తదితరులు పాల్గొన్నారు

కృష్ణానదిలో విద్యార్థి మృతి



నిఖిల్ (ఫైల్)

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంకు దిగువన కృష్ణా నదిలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ విద్యార్థి మృతి చెందాడు. స్థానిక ఏపీ జెన్‌కో కార్యాలయలో పని చేసే ఆశీర్వాదం ,కుమారి దంపతుల ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నిఖిల్(17) గుంటూరు జిల్లా పేరేచెర్లలో డిప్లొమో చదువుతున్నాడు. ఇటీవల సున్నిపెంటకు చేరుకున్న విద్యార్థి శనివారం స్నేహితులతో కలసి సరదాగా లింగాలగట్టు బ్రిడ్జి దగ్గర ఈత కొట్టేందుకు వెళ్లారు. కాగా నదిలో ఓ చోట లోతుగా ఉండగా ప్రమాదవశాత్తూ అందులో మునిగిపోయి గల్లంతయ్యాడు. గల్లంతైన విద్యార్థి కోసం కుటుంబీకులు గాలించగా రాత్రి 8.30 గంటల సమయంలో మృతదేహం లభించగా, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కంచి వర్సిటీలో నేడు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: కంచిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయం (డీమ్డ్ యూనివర్సిటీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర రావు పేర్కొన్నారు. కర్నూలులోని శంకర మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు ఖండేరిలోని శంక మందిరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 96290 32323, 96290 01144 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

నడవలేని 'తల్లీబిడ్డ'

- మూలకు చేరిన వాహనాలు
- బాలింతలకు తప్పని తిప్పలు
- ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో ఇంటికి
- వాహనాల డ్రైవర్లకు అందని జీతాలు
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

☛ రెండో కాన్పు కష్టం కావడంతో చాగలమర్రికి చెందిన విశాలను నంద్యాల నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గత నెలలో రెఫర్ చేశారు. సిజేరియన్ కాన్పు అనంతరం వారం రోజులు ఆసుపత్రిలో ఉన్న తర్వాత వైద్యులు ఆమెను డిశ్చార్జ్ చేశారు. అయితే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం పెట్రోల్ సరిపోదని చెప్పడంతో ఆమె అందులో వెళ్లలేకపోయారు.

☛ కౌతాళానికి చెందిన బజారమ్మ తన మొదటి కాన్పు కోసం ఆదోనికి వెళ్లగా ఆమెకు గుండెలో సమస్య కూడా ఉండటంతో కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఆమెను నెలరోజులు ముందుగా చేర్చుకుని అన్నీ సక్రమంగా అయ్యాక సిజేరియన్ ద్వారా ప్రసవం చేశారు. అయితే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం రాకపోవడంతో ఆమె ఆర్టీసీ బస్సులో కౌతాళం వెళ్లారు.

☛ ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే ఇద్దరు, ముగ్గురు జమ అయితేనే ఒకేసారి వాహనంలో తీసుకెళ్లేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కరికి మాత్రమే తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వాహనాల సంఖ్యను రెట్టింపు చేశారు. ప్రసవాలు జరిగే ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఈ వాహనాలు అందుబాటులో ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత రోజులు వస్తున్నాయి. పెట్రోల్ కొరత కారణంగా ఏ వాహనం ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.



పెద్దాసుపత్రిలో మూలకు చేరిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి జిల్లాలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల, డోన్, ఎమ్మిగనూరు, ఆదోని, ఆత్మకూరు, బనగానపల్లె ఏరియా ఆసుపత్రులు, 18 సీహెచ్‌సీలు 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 40 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్లు, కొన్ని పీహెచ్‌సీలు మినహా మిగిలిన వాటిలో ప్రసవాలు జరుగుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ప్రసవించిన వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లో ఇంటికి పంపించేందుకు గాను గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవీకే అనే ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు అప్పగించారు. ఈ మేరకు ఆ సంస్థ అప్పట్లో జిల్లాలో 28 వాహనాలను ఏర్పాటు చేసింది. ఆయా ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలను డిశ్చార్జ్ అనంతరం వారి ఇళ్లకు వాహనాల ద్వారా చేర్చేవారు. ఈ వాహనాలకు అప్పట్లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టారు.

అందని జీతాలు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనానికి ఒకరు చొప్పున 64 మంది డ్రైవర్లు ఉండాలి. ఏడాది కాలంగా ఈ వాహన డ్రైవర్లకు జీతాలు సరిగ్గా ఇవ్వడం లేదు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారు. గత మార్చి నుంచి ఇప్పటి వరకు జీతాలు చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో ఎనిమిది మంది డ్రైవర్లు ఉద్యోగం మానుకున్నట్లు సమాచారం. దీనికితోడు ఏ రోజూ వారు విధులకు సెలవు పెట్టేందుకు అవకాశం ఉండటం లేదు. తప్పనిసరిగా డ్యూటీకి రావాల్సిన పరిస్థితి నెలకొనడం, జీతం కూడా నెలకు మినహాయింపులు పోను రూ.7,870లు మాత్రమే వస్తుండటంతో ఉద్యోగాలు మానుకుంటున్నారు. ఈ కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల మండలాల్లో డ్రైవర్ పోస్టులు ఖాళీగా మారాయి.

నిర్వహణ అస్తవ్యస్తం

ఉమ్మడి జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నంద్యాల, ఆదోని ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆయా ఆసుపత్రుల వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు మాత్రం ఒక్కో వాహనంలో నలుగురికి మించి వస్తేనే అప్పట్లో తీసుకెళ్లేవారు. ఇదే సమయంలో ఒకే రూటులో ఉన్న బాలింతలు పోగయ్యేంత వరకు వేచి ఉండేవారు. మధ్యాహ్నం 1 గంటకు డిశ్చార్జ్ అయినా కొన్ని సార్లు రెండు, మూడు గంటలు వేచి ఉండాల్సి వచ్చేది. ఇలా వేచి ఉండలేని వారు సొంతంగా ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేవారు. అప్పట్లో వాహనాల నిర్వహణ కూడా సరిగ్గా ఉండేది కాదు. మరమ్మతులు చేయకపోవడంతో వాహనాలు మూలకుపడేవి.

వైఎస్సార్‌సీపీ హయాంలో దర్జాగా

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్యను 28 నుంచి 64కు పెంచింది. ఒకప్పుడు ముగ్గురు, నలుగురు బాలింతలను ఒకేసారి తీసుకెళ్లే పరిస్థితి నుంచి ఒక్కరు ఉన్నా తీసుకెళ్లే పరిస్థితికి చేరింది. పది కిలోమీటర్లైనా, వంద కిలోమీటర్లైనా సరే బాలింతలు అప్పట్లో దర్జాగా ఈ వాహనంలో వెళ్లేవారు. ఈ మేరకు ప్రతి నెలా 2వేల మంది దాకా బాలింతలను ఆయా వాహనాల్లో తీసుకెళ్లేవారు.

మళ్లీ పాత రోజులు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొదుపు చర్యల పేరుతో వాహనాల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న 64 వాహనాల్లో 8 వాహనాలు మూలకు చేరాయి. వాహనాలకు పెట్రోల్ వేయించడంలోనూ రేషన్ విధించారు. గతంలో నెలకు ఒక్కో వాహనానికి నెలకు రూ.40వేలు పెట్రోల్‌కు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.8వేలకు తగ్గించారు. డ్రైవర్లకు ఒక సిమ్ ఇచ్చారు. అందులో రూ.10వేలు మొత్తం ఉంటుంది. అయినా సరే రూ.4వేలు మాత్రమే పెట్రోల్ వేయించుకోవాలి. అది అయిపోయాక అనుమతి తీసుకుని మళ్లీ వేయించుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఒకసారి ఫుల్ ట్యాంకు పెట్రోల్ వేయిస్తే దూరాన్ని బట్టి కొన్నిసార్లు రెండు రోజులు మాత్రమే వస్తుంది. ఈ మేరకు వాహనానికి ఇచ్చిన రేషన్ వారం, పది రోజులకే అయిపోతోందని వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రసవం అనంతరం డిశ్చార్జ్ అవుతున్న బాలింత

నామమాత్రంగా బాలింతల తరలింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాలింతలను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా నామమాత్రంగా తరలిస్తున్నారు. వాహన డ్రైవర్లకు డ్యూటీ సమయం 8 గంటలు. ఈ మేరకు వారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంది. అలాగని సాయంత్రం 4 గంటలకు బాలింతలను వాహనాల్లో ఎక్కించుకున్నా తిరిగి వచ్చేసరికి కొన్నిసార్లు రాత్రి 7 నుంచి 8 గంటల సమయం పడుతోంది. ఈ మేరకు కొన్నిచోట్ల డ్రైవర్లు సాయంత్రం 4 గంటల్లోపు డిశ్చార్జ్ అయిన వారిని మాత్రమే తీసుకెళ్తున్నారు. ఆ తర్వాత డిశ్చార్జ్ అయితే తీసుకెళ్లడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఉద్యోగ భద్రత లేదు



లేబర్ యాక్ట్ ప్రకారం కనీస వేతనం మాకు రోజుకు రూ.700 ఇవ్వాలి. ప్రస్తుతం మినహాయింపులు పోను రూ.7,870 మాత్రమే ఇస్తున్నారు. అవి కూడా నాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఇస్తున్నారు. దీనికితోడు ఉద్యోగ భద్రత లేదు. మా పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. మే 20న నల్లబ్యాడ్జీలు ధరించి సమ్మె చేశాం.

-కె.రంగస్వామి, ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

డీఎస్సీపై డౌట్ లోడ్!

డౌన్‌లోడ్ కాని హాల్ టికెట్లు

- పరిష్కారం చూపని రాష్ట్ర ప్రభుత్వం
- వేధిస్తున్న సాంకేతిక సమస్యలు
- ఆందోళనలో డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీలో 'పొర'పాట్లు' చోటుచేసుకుంటున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి హాల్ టికెట్లు జారీ చేస్తామని డీఎస్సీ జేడీ కార్యాలయం చెప్పింది. అయితే కొందరికి మాత్రమే డౌన్‌లోడ్ అయ్యాయి. వాటిలోనూ తప్పులు ఉన్నాయి. మొత్తం మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే ఒకదానికి మాత్రమే హాల్‌టికెట్ వచ్చింది. ఐడీ నంబర్, పాస్‌వర్డ్ ఎంటర్ చేసినా హాల్ టికెట్ డౌన్‌లోడ్ కాలేదు. సాంకేతిక సమస్యలతో చాలా మంది డీఎస్సీ అభ్యర్థులు ఆందోళన చెందారు. కర్నూలు జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ దృష్టికి తీసుకుపోవడంతో ఆ తర్వాత వారు డీఎస్సీ నిర్వాహకుల దృష్టికి సమస్యను తీసుకుపోయిన తర్వాత కొంత పరిష్కారమయ్యింది. డీఎస్సీకి రాష్ట్రంలో అత్యధికమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంతో సాంకేతిక సమస్యలతో హాల్‌టికెట్లలో పొరపాట్లు వచ్చాయని, ఆదివారం ఉదయంలోపు సమస్య సర్దుబాటు అవుతుందని అభ్యర్థులకు డీఈఓ తెలియజేశారు.

ఏ కేంద్రంలో ఎంతమంది?

ఉమ్మడి జిల్లాలో 2,645 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు మొత్తం 73,605 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో కర్నూలులో 5, నంద్యాలలో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఏ కేంద్రంలో ఎంతమంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలి. అయితే ఈ పరీక్షల నిర్వహణపై ఇంతవరకు స్పష్టత రాలేదు. నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడంపై అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశమున్నట్లు ఆందోళన చెందుతున్నారు. ఒకే రాష్ట్రం, ఒకే ప్రశ్నపత్రం, ఒకే జిల్లా ఒకే ప్రశ్నపత్రం విధానంలో పరీక్షలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని నెల రోజులుగా అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



హాల్‌టికెట్ సమస్యల వివరాలను డీఈఓకు చూపిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

ఇదీ నిర్లక్ష్యం..

- ➡ అదిగో ఇదిగో అంటూ సుమారు 11 నెలలు జాప్యం చేసి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు.
- ➡ ప్రిపరేషన్‌కు సమయం లేకుండా పరీక్షలు నిర్వహించడంపై ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.
- ➡ 45 రోజులు మాత్రమే ప్రిపరేషన్‌కు అవకాశం ఇవ్వడంపై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.
- ➡ నోటిఫికేషన్‌లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గత నెల 30వ తేదీ నుంచే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ కావాలి. అయితే డీఎస్సీ నిర్వహణపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతోనే షెడ్యూల్ ప్రకారం హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ కాలేదు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు

కోవెలకుంట్ల: చదువుకు పేదరికం అడ్డుకారాదని కార్మిక శాఖ అదనపు కార్యదర్శి, జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు అన్నారు. సంజామల మండలం ఆల్వకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లె పుల్లయ్య శనివారం పదవీ విరమణ పొందారు. పట్టణ శివారులోని వీఆర్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయనకు పదవీ విరమణ సన్మాన సభ ఏర్పాటు చేశారు. గంధం చంద్రుడు ఈ కార్యక్రమానికి హాజరై తనకు చదువు చెప్పి ఉన్నత స్థాయిలో నిలిపిన ఉపాధ్యాయుడిని ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 1950 సంవత్సరానికి ముందు చదువు మూడు శాతం మందికి మాత్రమే అందేదని, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక విద్య అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. 2024 కులగణన ప్రకారం అక్షరాస్యత, కుటుంబ మౌలిక సదుపాయాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందన్నారు. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో ఉపాధ్యాయుడికి సముచితస్థానం ఉందన్నారు. కొలిమిగుండ్ల మండలం కోటపాడు ప్రాథమిక పాఠశాలలో 1990-92 మధ్యకాలంలో తాను పుల్లయ్య సార్ వద్ద చదువు నేర్చుకుని జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యానన్నారు. ఆ తర్వాత కాలంలో ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ సాధించానని ఈ సందర్భంగా చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజయ్య, వెంకటసుబ్బయ్య, ఈశ్వరయ్య, హెచ్‌ఎం హరిప్రసాద్, రిటైర్డ్ హెచ్‌ఎంలు నాగేశ్వరరెడ్డి, పక్కీరెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన పుల్లయ్య దంపతులను సత్కరిస్తున్న ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు

నేటి నుంచి అందుబాటులోకి జీజీహెచ్ ప్రధాన ద్వారం

- ఓపీ కావాలంటే ఆధార్ తప్పనిసరి
- వైద్యులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక పార్కింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారం ఎట్టకేలకు తెరుచుకోనుంది. గతంలో ట్రాఫిక్ సమస్యల కారణంగా మూసివేసిన గేటును సోమవారం నుంచి తిరిగి తెరవబోతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోగుల ఇక్కట్లను దృష్టిలో ఉంచుకొని ఈ గేటును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో పార్కింగ్ స్థలాలు లేక కొన్నేళ్లుగా రోగులు, వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ఇక నుంచి వారికి వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను కేటాయిస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ ఫోన్ నెంబర్ లింక్ అయిన ఆధార్‌కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. దీనివల్ల వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయని, ఇది దేశంలో ఎక్కడికి, ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినా తదుపరి చికిత్స సులభతరమవుతుందన్నారు. ఇకపై ఓపీ తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేశామన్నారు. ప్రతి పీహెచ్‌సీ, సచివాలయాల్లో ఆయుష్మాన్ ఐడీ కార్డు రూపొందిస్తారని, అక్కడికి వెళ్లి కార్డు జనరేట్ చేసుకోవాలని సూచించారు.

WANTED TEACHERS

DATE : 04-06-25 & 05-06-25 (9:00AM TO 4:00PM)
VENUE : Montessori Residential School - Alampur

IIT FOUNDATION TEACHERS		CBSE TEACHERS
CLASS	SUBJECT	SUBJECT
VIII - X	MATH, PHYSICS CHEMISTRY	MATH, PHYSICS, CHEMISTRY, ENGLISH, TELUGU

1. PG or UG with B. Ed can apply.
2. Send Resume + Self-Intro Video (2 min) by WhatsApp. (9441808648)
3. Selected candidates will be called for Test & Demo at MRS @ Alampur.
4. TA WILL BE PAID for attending the interview.
5. For Info Call : 9014880719 - 99662 46435

NOTE: DSC Applicants can attend the Interview & Report after the exam.

MONTESSORI RESIDENTIAL SCHOOLS
ALAMPUR & PANCHALINGALA - CBSE AFFILIATION NO: 3630378

చెట్నహాళ్లిలో అంత్యక్రియల వివాదం



చెట్నహాళ్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: చెట్నహళ్లి గ్రామ శ్మశాన వాటికలో అంత్యక్రియల విషయం రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. తమ ఇళ్లను అనుకుని ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించరాదని కొందరు అడ్డుకుంటున్నారు. మరికొందరు మాత్రం తమకు వేరే స్థలం లేదని అక్కడే అంత్యక్రియలు చేపడతామన్నారు. రెండు నెలలుగా ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం ఉదయం శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ విషయం తెలిసి కొందరు గ్రామంలోని 167వ జాతీయ రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ ఇళ్ల వద్ద అంత్యక్రియలు చేయొద్దంటూ నినదించారు. విషయం తెలుసుకున్న సీఐ రామాంజులు సంఘటన స్థలానికి వెళ్లి ఆందోళనకారులను శాంతింపజేశారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

కర్నూలు: నగర శివారులోని కోడుమూరు రోడ్డులో ఉన్న శ్రీనివాస నగర్‌లో నివాసముంటున్న సుంకన్న కూతురు మౌనిక (19), ఖలీల్ బాషా కూతురు షేక్ సానియా (16) అదృశ్యమయ్యారు. మౌనిక 8వ తరగతి వరకు చదువుకుంది. షేక్ సానియా 10వ తరగతి వరకు చదువుకుంది. ఇద్దరూ ఇంటి దగ్గరే ఉంటున్నారు. వీరిద్దరిదీ పక్కపక్క ఇళ్లు కావడంతో మంచి స్నేహితులుగా మారారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా ఇంటి వద్ద నుంచి ఆటోలో కొత్తబస్టాండ్‌కు చేరుకున్నట్లు బయట పడింది. దీంతో ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి తెలిపారు.

శివాలయంలోకి పాము

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె సమీపంలో ఉన్న లొక్కిగుండం రామేశ్వర స్వామి ఆలయంలో శనివారం పాము ప్రత్యక్షమైంది. తుమ్మలపెంటకు చెందిన భక్తులు ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లగా పాము శివలింగాన్ని చుట్టుకొని కనిపించడంతో గట్టిగా కేకలు వేశారు. తర్వాత పాము శివలింగం నుంచి కిందకు వచ్చి ఆలయంలోనే ఉండిపోయింది. కొద్ది సేపటి తర్వాత పాము బయటకు వచ్చి పొదల్లోకి వెళ్లిపోవడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ కర్నూలు - ప్రకాష్‌నగర్‌లో U-Con Charry Apartment నందు ఫ్లాట్ నెం. 1, 2BHK గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్రదించండి: 98666 45393 [SCA25004157]

PLOT FOR SALE

■ కర్నూలు నంద్యాల రోడ్‌లో మయూరి గ్రీన్‌హిల్స్ నందు ఫ్లాట్ నెం. 437 (2nd ఫేస్) 150, 151 (4th ఫేస్) అమ్మకానికి కలవు. సంప్రదించండి: 99124 40861 [SCA25004169]

■ వెల్దుర్తి మండలం బింగిదొడ్డి నందు (NH-44 నుంచి 3Km)-ఆవ్య లోటస్ ఫార్మ్స్ నందు ప్రత్యేక తగ్గింపు ధరలో ప్లాట్స్ కలవు. వివరాలకు సంప్రదించండి. సెల్: 99120 55552. [SCA25003754]

LAND FOR SALE

■ కర్నూలు-నంద్యాల రోడ్డు, హుసేనాపురం, పంచాయతీ పరిధిలో హైవేకు, స్టీల్ ప్లాంటుకు దగ్గరలో సర్వే నెం: 425, 6.06 ఎకరాల భూమి, వెంచర్లకు అనుకూలమైన భూమి అమ్మబడును. డైరెక్ట్ ఓనర్: 63002 65849. [SCA25004423]

FLAT FOR SALE

■ నార్త్ ఫేస్ ఫ్లాట్స్ 44FTX80Ft and 22FtX40Ft మంచి లొకేషన్ 1Km NH7 &1.5km బళ్ళారి చౌరస్తా, విష్ణు టౌన్ షిప్ ముందు సెల్ : 9492702333 [SCA-25004172]

TO - LET

■ కర్నూలులోని తాండ్రపాడు హైవేకు ఆనుకొని 4000 Sft గల రెండు ఫ్లోర్లు బిల్డింగ్ అద్దెకు కలదు. సెల్ : 9849493305, 6300644328. [SCA25004318]

■ కర్నూలు పాతబస్టాండ్ తమిళనాడు బ్యాంకు పైన సింగల్ బెడ్ రూమ్, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి శాఖాహారులకు బాడుగకు ఇవ్వబడును. సెల్: 95422 18109. [SCA25004096]

■ Shops/ Godowns : 3.Shops linked, 40 Feet road access. Sri Lakshmi Commercial Complex, Opp: 4th town P.S, Bellary Chowrastha, Kurnool. Cell: 94410 40844. [SCA25004207]

LEASE / RENT

■ Eeco-2025 model car for lease: companies/hospital/college/school. Contact: 99593 94930. [SCA25004412]

SERVICES

FOR SALE

■ మా వద్ద అన్ని రకముల స్కూల్ డ్రస్సులు లభించును. స్వాతి సిల్క్ హౌస్, నెహ్రూ రోడ్డు, ఎ.కె.మార్కెట్ ఎదురుగా, కర్నూలు. వివరాలకు సంప్రదించండి: సెల్: 9849846562, 8121862725. [SCA25004417]

HEALTH CARE

■ డాక్టర్ IVN వైభవ్‌రెడ్డి, MBBS, M.D.DVL చర్మ వ్యాధి, సుఖ వ్యాధి, కుష్ఠు వ్యాధి నిపుణులు, 6PM-9PM. CN హాస్పిటల్, బిర్లా గేట్ దగ్గర, బి.క్యాంప్, కర్నూలు. సంప్ర: 9642610452, 08518-230377. [SCA25004356]

PHYSICIAN

■ డా॥కె.చంద్రమౌళీ రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ & ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, ప్రతి గురువారం షుగర్ ఫ్రీ చెకప్. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [SCA25003233]

UNANI

■ దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్, గుండెలో నొప్పి, మంట మరియు పక్షవాతము వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. Md. షఫీ హకీమ్, కర్నూలు. 9397011918. [SCA25003557]

GYNECOLOGY

■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. ✆ 88970 87874 [SCA25003230]

MARRIAGE SERVICES

వధువు కావలెను

■ దూదేకుల: 45/5.8/స్వంత బిజినెస్, నెలకు: 30వేలు, 30లక్షలు ప్రాపర్టీ గల వరునికి 30 నుండి 40 సం॥లు వయస్సు గల వధువు కావలెను. డైరెక్ట్: ✆ 99636 27718. [SCA25004125]

WANTED

■ కర్నూలు నందు పని చేయుటకు మంచి వాక్చాతుర్యము గల లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్రదించండి. సెల్: 90322 23367. [SCA25004446]

■ ప్రముఖ పాన్ షాప్ (24/7) వర్క్ చేయడానికి అనుభవం కలిగిన యువకులు కావలెను. 96666 09935, 96520 20210, 90636 31552. [SCA25004363]

■ కర్నూలు కొత్తబస్టాండ్‌కు సమీపంలో ప్రముఖ హాస్పిటల్‌లో వార్డ్ బాయ్‌గా పనిచేయుటకు అబ్బాయిలకు 10 పోస్టులు కలవు. జీతం: 10,500/- ESI, PF అదనముగా చెల్లించబడును. యుగంధర్: 9949966477. [SCA25004431]

■ నెట్‌వర్క్ లీడర్స్ కావలెను. Swaminee Life pvt.Ltd., కేవలం రూ. 1680/- ఒక్కసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించండి. Daily Pay Outs. Cell: 79899 88212. [SCA25004213]

■ రాయలసీమ స్కూల్ కర్నూలు నందు నర్సరీ to 8th క్లాస్ వరకు అన్ని సబ్జెక్టులు అండ్ కంప్యూటర్ లేడీస్ టీచర్లు కావలెను. వివరాలకు సంప్రదించండి: ✆ 9949804648, 9398252467. [SCA25004245]

■ Wanted Sr. Accountant with Tally experience for Hyundai car Show room in Kurnool. Details Contact: 9885822122, 9885418126. [SCA25004349]

■ Wanted Teachers for 1st to 10th Class for all Subjects, Clerk cum Computer Operator and Warden. R.R High School, Maddur Nagar, Kurnool. Cell: 94402 90162. [SCA25004205]

■ Wanted Teachers 1st to 10th class for all subjects & computer operator. Swami vivekananda high school, balaji Nagar, knl. ✆ 8985201377, 9052240989. [SCA25004327]

■ WANTED High School English Teacher, Assistant Teachers, School Record Assistants, Graphic Designers for Reputed school. experienced candidates can call immediately. ✆ 96426 06558. [SCA25004418]

■ Wanted Show room Sales Executives for Hyundai Car Show rooms in Kurnool, Nandyal & Adoni. Contact: 9133314336, 9160114474, (Salary+ Incentives+ Allowances). [SCA25004348]

■ ప్రముఖ స్టీల్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహించుటకు (Male / Female) అభ్యర్థులు కావలెను. టూవీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. సెల్ : 8121213311, 9010559955. steelbuddy144@gmail.com [SCA25004400]

■ ఆర్.ఆర్.క్రిష్టియన్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ నంద్యాల నందు B.Sc నర్సింగ్ ట్యూటర్స్ కావలెను. సంప్రదించండి: ✆ 9490727817, 6301875358 [SCA25003520]

■ అన్‌లోడర్స్ పురుషులు కావలెను. 8గం॥డ్యూటీ Age: 25-45 years, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తప్పనిసరి. మంచిజీతం+ESI+EPF కలవు. ✆ 9100028528, 7396128206 [G-27]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15907]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

నాలుగు లైన్లకు రూ.	300/-
అదనపు లైనుకు రూ.	75/-
క్లాసిఫైడ్ డిస్‌ప్లే (Sq.Cm) (Width: 3.7 Cms, Height Minimum 3 Cms.)	215/-

5% GST అదనం

మరిన్ని వివరాలకు సంప్రదించండి
70750 09185
70750 09165

వివరాలకు: యూనిట్ కార్యాలయం, భారత్ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్ ప్రక్కన, నేషనల్ హైవే-7, లక్ష్మీపురం, కర్నూలు.